నమస్తే తెలంగాణ
వరంగల్
10 | వరంగల్, ఆదివారం 27 ఏప్రిల్ 2025 | WARANGAL


ఎల్కతుర్తిలో ముస్తాబైన సభా వేదిక



# మహోజ్వల ఘట్టానికి వేళాయె

## నేడే బీఆర్ఎస్ రజతోత్సవ సంరంభం

## 25 ఏళ్ల పండుగకు వేదికైన ఎల్కతుర్తి

- దారులన్నీ ఓరుగల్లు వైపే
- దండులా కదిలొస్తున్న లక్షలాది జనం
- ఎడ్లబండ్లు, ప్రభబండ్లు, పాదయాత్రగా సభకు
- కనీవినీ ఎరుగని రీతిలో సభ ఏర్పాట్లు
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగం కోసం ఎదురుచూపు
- మహాసభపై అన్ని వర్గాల ఆసక్తి

**మహోజ్వల ఘట్టానికి వేళయింది. బీఆర్ఎస్ పార్టీ 25వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా నిర్వహించే రజతోత్సవ వేడుకకు సర్వం సిద్ధమైంది. ఎల్కతుర్తి వేదికగా ఆదివారం కనీవినీ ఎరుగని రీతిలో జరుగబోయే పాతికేళ్ల పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తికాగా ఊరూవాడా ఏకమై లక్షలాదిగా కదిలివస్తున్నది. ఇప్పటికే ఎడ్లబండ్లు, ప్రభబండ్లు, ఆటోలతో ర్యాలీలు.. పాదయాత్ర చేసుకుంటూ మహాసభకు చేరుకుంటుండడంతో దారి పొడవునా పండుగ వాతావరణం నెలకొన్నది. అలాగే సభా ప్రాంగణం సహా వరంగల్ నగరమంతా బీఆర్ఎస్ జెండాలు, ఫ్లెక్సీలు, కటౌట్లు, స్వాగత తోరణాలతో ముస్తాబై గులాబీ వర్ణం సంతరించుకుంది. ఇక అందరి దృష్టి నేటి మహాసభపై ఉండగా కేసీఆర్ ప్రసంగం వినాలనే ఉత్సాహం సర్వత్రా కనిపిస్తోంది.**
**- ఎల్కతుర్తి, ఏప్రిల్ 26**

అన్ని వర్గాలు ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. తెలంగాణలో ప్రతి ఒక్కరు ఆసక్తి చూపిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఎల్కతుర్తిలో ఆదివారం సాయంత్రం అట్టహాసంగా జరుగనున్నది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వేదికగా చేసే ప్రసంగం కోసం అన్ని వర్గాలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నాయి. ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు, తెలంగాణవాదులు, కేసీఆర్ అభిమానులు ఎల్కతుర్తి మహాసభకు వస్తున్నారు. ఎడ్లబండ్లు, మోటారు సైకిళ్లు, ఆటోలు, వ్యాన్లు, బస్సుల్లో స్వచ్ఛందంగా మహాసభకు బయలుదేరుతున్నారు. వేలాది వాహనాలతో లక్షలాది మంది బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు వస్తున్నారు. ఎల్కతుర్తికి చేరుకునే అన్ని రోడ్లలోనూ శనివారం రాత్రి నుంచే సందడి మొదలైంది. ఎల్కతుర్తి నుంచి అన్ని దారుల్లోనూ గులాబీ జెండాలు, ఫ్లెక్సీలు, కటౌట్లు అందంగా ముస్తాబయ్యాయి. లక్షలాది మంది హాజరయ్యే మహాసభను పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా 2001, ఏప్రిల్ 27న టీఆర్ఎస్ ఏర్పాటైంది. కేసీఆర్ నాయకత్వంలో అలుపెరుగని ఉద్యమంతో తెలంగాణ రాష్ట్రం సాధించింది. పదేండ్ల సుపరిపాలనతో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిపింది. ఆ తర్వాత బీఆర్ఎస్‌గా మారింది. బీఆర్ఎస్ ప్రస్థానంలో ప్రస్తుతం కీలక సందర్భం వచ్చింది. 14 ఏండ్ల ఉద్యమం, పదేండ్ల సుపరిపాలన, 16 నెలలుగా సమర్థవంతమైన ప్రతిపక్ష పాత్ర.. అన్నింటి మేళవింపుగా బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఎల్కతుర్తిలో ఘనంగా జరుగుతున్నది. బీఆర్ఎస్ ప్రస్థానంలో కీలకమైన ఈ మహాసభకు ఏర్పాట్లు ఘనంగా జరిగాయి. భారీ బహిరంగసభల నిర్వహణలో బీఆర్ఎస్ గతంలో ఉన్న రికార్డులను కొనసాగించేలా ఎల్కతుర్తి మహాసభ జరుగనున్నది. ఎండల తీవ్రత నేపథ్యంలో మహాసభకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. 10 లక్షల వాటర్ బాటిళ్లను, 10 లక్షల సల్ల ప్యాకెట్లను సభా ప్రాంగణంలో ఎక్కువ చోట్లలో పంపిణీ చేయనున్నారు. అత్యవసరాల కోసం మరో 6 లక్షల మజ్జిగ ప్యాకెట్లను సిద్ధంగా పెట్టారు. మహాసభ ప్రాంగణం చుట్టుపక్కల 12 వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. అత్యవసర వైద్య సేవల కోసం ఆరు అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. మహాసభ ప్రాంగణం పరిధిలో 1200 తాత్కాలిక టాయ్‌లెట్స్‌ను ఏర్పాటు చేశారు. మహాసభకు వచ్చే వారికి సాయం చేసేందుకు, పార్కింగ్ నిర్వహణ కోసం 2 వేల మంది వలంటీర్లు ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో శనివారం రాత్రి నుంచే విధులకు సిద్ధమయ్యారు.





రజతోత్సవానికి స్వాగతం
సభ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణం


సభా వేదికపై తన కుటుంబాన్ని ఫొటో తీస్తున్న చిన్నారి

### పకడ్బందీగా ఏర్పాట్లు

బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు వచ్చే వాహనాల పార్కింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఎల్కతుర్తికి వచ్చే అన్ని ప్రధాన రోడ్లలో వేల చోట్ల మహాసభ మార్గాన్ని సూచించేలా బోర్డులను పెట్టారు. వాహనాల్లో వచ్చే ఏ ఇబ్బంది లేకుండా బోర్డులను చూసుకుంటూ మహాసభకు సులభంగా చేరుకునేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయి. రజతోత్సవ మహాసభ నిర్వహణ కోసం ఎల్కతుర్తిలోని 1213 ఎకరాల్లో ఏర్పాట్లు చేశారు. 154 ఎకరాల్లో బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ప్రాంగణం, 500 మంది కూర్చునే సామర్థ్యంతో వేదిక సిద్ధమయ్యాయి. 1059 ఎకరాల్లో పార్కింగ్ మహాసభకు వచ్చే వాహనాల పార్కింగ్ నుంచి కిలో మీటరు దూరంలోపే మహాసభ ప్రాంగణం ఉన్నది. వాహనాల్లో వచ్చిన వారు సల్వ దూరంలోనే మహాసభకు చేరుకునేలా మట్టి రోడ్లను ఏర్పాటు చేశారు. సభాప్రాంగణంలో, పార్కింగ్ ప్రదేశాల్లో 200 జనరేటర్లతో లైటింగ్ వ్యవస్థను సిద్ధం చేశారు. మహాసభ ప్రాంగణం నుంచి కిలో మీటర్ల దూరం వరకు కేసీఆర్ ప్రసంగం స్పష్టంగా కనిపించేలా, వినిపించేలా 23 ఎల్ఈడీ భారీ స్క్రీన్లను, సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యవేక్షణలో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్, బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గ్యాదరి బాలమల్లు ఆధ్వర్యంలో 25 రోజులుగా బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ పనులు జరిగాయి.


బండెనక బండి కట్టి.. ఎల్కతుర్తి బాటపట్టి
సూర్యాపేట నుంచి నగరానికి చేరుకున్న ఎడ్లబండ్ల ర్యాలీ


విద్యుత్ వెలుగుల్లో సభా ప్రాంగణం


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

## 1100మంది పోలీసులతో బందోబస్తు

సుబేదారి, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు 1100మంది పోలీసులు బందోబస్తులో పాల్గొననున్నారు. ఇద్దరు డీసీపీలు, ఇద్దరు అదనపు డీసీపీలు, 8మంది ఏసీపీలు, 28మంది ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు 66మంది ఎస్సైలు 137మంది హెడ్ కానిస్టేబుళ్లు, 511మంది 200 హోంగార్డ్స్, మిగతా వారు డిస్ట్రిక్ట్ గాడ్స్, పోలీసు బందోబస్తు ఏర్పాట్లపై వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## గులాబీ జెండాయే తెలంగాణకు శ్రీరామరక్ష

### సభా ప్రాంగణాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ కవిత

ఎల్కతుర్తి, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ రజతోత్సవ సభా ప్రాంగణాన్ని శనివారం రాత్రి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను సభకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ తోనే తెలంగాణకు న్యాయం జరుగుతుందని, గులాబీ జెండానే తెలంగాణకు శ్రీరామరక్ష అని ఆమె అభివర్ణించారు. సభావేదికకు వచ్చిన ఎడ్లబండ్లను కవిత నడిపి వారిని ఉత్సాహపర్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు పాల్గొన్నారు.


ఎడ్లబండి నడుపుతున్న ఎమ్మెల్సీ కవిత

# బైలెల్లిన ప్రభబండి

- ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- సంగెంలో డప్పుచప్పుళ్లతో స్వాగతం పలికిన ప్రజలు

సంగెం/హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 26 : రజతోత్సవ మహాసభకు బీఆర్ఎస్ ప్రభబండిని శనివారం సంగెం మండలకేంద్రంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రారంభించారు. గుమ్మడికాయ కొట్టి ప్రభబండిని ప్రారంభించిన అనంతరం గ్రామస్తులు డప్పుచప్పుళ్లు, మహిళలు కోలాటాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రజతోత్సవ పండుగకు ప్రతి గడప నుంచి తరలిరావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలు ఎలాంటి ఇబ్బంది లేకుండా సంతోషంగా ఉన్నారని, మళ్లీ కేసీఆర్ పాలననే కోరుకుంటున్నట్లు తెలిపారు. సొంత ప్రయోజనాల కోసం పార్టీని వదిలివెళ్లే వారి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. మేడారం జాతరను తలపించేలా ఎల్కతుర్తి సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ కుమారస్వామి, మాజీ సర్పంచ్‌లు సాగర్‌రెడ్డి, గుండేటి బాబు, కుమారసామ్వామి, మాజీ ఎంపీటీసీలు దొనికెల మల్లయ్య, సదానందం, మేరుగు వీరేశం, యార బాలకృష్ణ, రాజుయాదవ్, జక్క మల్లయ్య, కోడూరి సదయ్య, మనోహర్, మొగిలి, బుచ్చిరెడ్డి, శరత్‌బాబు, సంపత్, సమ్మయ్య, ఉమామహేశ్వరి పాల్గొన్నారు. గీసుగొండ, సంగెం మండలాల నుంచి బయలుదేరిన ప్రభబండ్లు శనివారం సాయంత్రం హనుమకొండకు చేరుకోగా, పబ్లిక్ గార్డెన్ వద్ద మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు కొబ్బరికాయలు కొట్టి ఘనస్వాగతం పలికారు. ఎడ్లబండ్లను నడుపుతూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. దేశ చరిత్రలో కనీవిని ఎరగనిరీతిలో బీఆర్ఎస్ సభ జరుగుతుందన్నారు.


ప్రభబండి ముందు నృత్యం చేస్తున్న గిరిజనులు



సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్


ప్రభబండి నడుపుతున్న చల్లా, పక్కన దాస్యం


వేదికపై ఫొటో దిగుతున్న అభిమానులు


బీఆర్ఎస్ జెండాలు, కటౌట్లతో గులాబీమయమైన ఎల్కతుర్తి దారులు

ఎడ్ల బండ్లతో ర్యాలీగా వస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు


# కొమ్మాల జాతరలా జనం తరలిరావాలి

- కేసీఆర్ ముచ్చట వినేందుకు దండు కడుతున్న రైతులు
- ఎడ్లబండ్ల సప్పడుతో కాంగ్రెసోళ్లకు వణుకు పుట్టాలె..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హసన్‌పర్తి, ఏప్రిల్ 26 : కొమ్మాల జాతరలాగా రజతోత్సవ సభకు రైతులు, కార్యకర్తలు తరలిరావాలని వర్ధన్నపేట ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. గ్రేటర్ ఒకటో డివిజన్ పరిధిలోని పెడగపల్లి క్రాస్ రోడ్డు నుంచి ఎర్రగట్టు వద్దకు ఒకటో డివిజన్ అధ్యక్షుడు నరెడ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిదిగా దయాకర్‌రావు హజరైయ్యారు. మహిళలు బతుకమ్మలతో కోలాటాలతో డీజే సప్పుల్లతో ఎర్రబెల్లికి స్వాగతం పలికారు. అనంతనం మహిళలతో కలిసి ఎర్రబెల్లి బతుకమ్మ ఆడిపాడారు. అనంతరం ఎడ్లబండి నడుపుతూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే రాష్ట్ర సాధనే ఏకైక మార్గమని భావించి, ఉవ్వెత్తున్న ఉద్యమాన్ని నడిపించి, చివరకు తన ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా ఆమరణ నిరాహార దీక్ష చేసి రాష్ట్రం సాధించిన మహావ్యక్తి కేసీఆర్ కొనియాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ సస్యశ్యామలమైందన్నారు. మాయ మాటలతో గద్దెనెక్కిక కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ప్రతి గ్రామం నుంచి రైతులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో తరలివచ్చి కేసీఆర్‌కు మద్దతు పలకడం కోసం రైతులు దండు కడుతున్నారని, వారు నడిపే ఎడ్లబండ్ల సప్పుడుకే కాంగ్రెసోళ్లకు వణకు పుట్టాలన్నారు. ఇప్పుడికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్‌కు వంద సీట్లు రావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు కుమార్‌యాదవ్, భూక్యా సాంబయ్యనాయక్, శ్రీను, శ్రీధర్, ప్రమోద్ పాల్గొన్నారు.